
ఉప్పునుంతల మండలం పెనిమిళ్లలో పత్తి విత్తనాలు విత్తుతున్న చిన్నారులు


అచ్చంపేట మండలం ఎద్దుమిట్ట తండాలో పత్తి విత్తనాలు నాటేందుకు గొర్రుతో అచ్చులు కొడుతున్న రైతు


నారాయణపేట మండలం సింగారంలో ట్రాక్టర్‌తో జొన్న విత్తనాలు వేస్తున్న రైతు


గట్టు మండలం ఆలూరులో ఎద్దులతో పొలాన్ని చదును చేస్తున్న రైతు


పంటలు సాగు చేసేందుకు నారాయణపేట నుంచి ఎద్దుల బండిపై ఎరువులు, విత్తనాలు తీసుకెళ్తున్న రైతు

పొలం బాట

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు పొలంబాట పట్టారు. ఈ ఏడాది రోహిణి కార్తెలోనే వానలు కురవడంతో పంటలు బాగా పండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వివిధ రకాల విత్తనాలు వేశారు. మెట్ట పంటలైన జొన్నలు, రాగులు, సజ్జలు, పెసర్లు, పత్తి తదితర పంటల సాగులో నిమగ్నమయ్యారు. గత ఏడాది వర్షాభావంతో పంటలు సరిగా పడకపోవడంతో ఈసారైనా కాలం కలిసొస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నారు.

- ఈసారి రోహిణి కార్తెలోనే వానలు
- మెట్ట పంటలు వేస్తున్న రైతులు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది 55 వేల ఎకరాల్లో పెరుగనున్న సాగు
- మహబూబ్‌నగర్ జిల్లా సీసీకుంటలో సిద్ధం చేస్తున్న నారుమళ్లు
- నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో పొలం పనుల్లో రైతుల బిజీబిజీ


నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం పెనిమిళ్లలో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళ


మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో విత్తనాలు వేస్తున్న రైతులు

మహబూబ్‌నగర్/నారాయణపేట/అచ్చంపేట/మన్ననూరు/గట్టు/వనపర్తి అర్బన్, జూన్ 7: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రోహిణి కార్తెలోనే తొలకరి పలుకరించింది. దాంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వానాకాలం సాగు ముందే మొదలైంది. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాల్లో జొన్నలు వేయగా అవి ఇప్పటికే మొలకెత్తాయి. ప్రస్తుతం రెండ్రోజుల నుంచి పలు ప్రాంతాల్లో పత్తి విత్తనాలు వేస్తున్నారు. ఎండలు బాగా ఉండాల్సిన రోహిణి కార్తెలో వానలు కురుస్తుండటంతో ఇప్పటికే వాతావరణం చల్లబడింది. ఈ కార్తెలో విత్తనాలు నాటితే దిగుబడి బాగా ఉంటుందని, తెగుళ్లు కూడా అంతగా ఉండవని రైతులు భావిస్తారు. అందుకు తగ్గట్టుగా వర్షాలు కురుస్తుండటంతో వేసవి దుక్కులు దున్నిన వారంతా విత్తనాలు వేస్తున్నారు. జిల్లాలో 15 రోజుల నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సీసీకుంట మండలంలో మూడు రోజుల కిందట 75 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దాంతో అక్కడ రైతులు వరి తుకాల కోసం నారు మళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. భూత్పూర్, మూసాపేట, నవాబ్‌పేట, హన్వాడ, గండీడ్ మండలాల్లో విత్తనాలు వేస్తున్నారు. గురువారం జిల్లా కేంద్రంతో పాటు భూత్పూర్, హన్వాడ, మూసాపేట, దేవరకద్ర, సీసీకుంట మండలాల్లో వర్షం కురిసింది. ఈ వానతో ఇదివరకే నాటిన విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు పత్తివిత్తనాలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసే అవకాశం ఉండటంతో సాగు విస్తీర్ణం పెరుగనున్నట్లు తెలుస్తోంది.


సీసీకుంట మండలంలో విత్తనాలు వేస్తున్న మహిళా రైతు

సిద్ధం చేస్తున్న దుక్కులు

వనపర్తి జిల్లాలో పంటలు వేసేందుకు రైతులు దుక్కులను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే 40-50 శాతం మంది రైతులు దుక్కులను సిద్ధం చేశారు. ఈ సారి జిల్లాలో 2 లక్షలా 40 వేల ఎకరాల్లో పంటలు సాగవనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూస్తామని అంటున్నారు. పంటల సాగులో రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని చెబుతున్నారు.

పొలం పనుల్లో బిజీబిజీ..

నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా పంటల సాగు జోరందుకుంది. జిల్లాలో 4,73,760 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. 20 రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుడటంతో మెట్ట పంటలైన పత్తి, మొక్కజొన్న, జొన్నలు, సజ్జలు, కందులు, ఆముదం వంటి పంటలను రైతులు సాగు చేశారు. రెండేళ్లుగా వర్షాలు సరిగా కురువనందున రైతులు నష్టపోయారు. వారం రోజులుగా రోజు విడిచి రోజు వర్షాలు కురుస్తుడటంతో పిల్లా పాపలతో కలిసి విత్తనాలు వేస్తున్నారు. నల్లమల ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం పడటంతో రైతులు శుక్రవారం వివిధ విత్తనాలు వేశారు. మన్ననూరు, ప్రశాంత్‌నగర్, మాచారం, వెంకటేశ్వర్లబావి, పర్హాబాద్, తుర్కపల్లి తదితర గ్రామాల్లో వర్షం పడటంతో జొన్నలు, సజ్జలు, రాగులు, పత్తి తదితర విత్తనాలు వేశారు.

జొన్నలు, పెసర్లు వేసిన రైతులు


నారాయణపేట మండలం సింగారంలో ఎరువులు చల్లుతున్న మహిళ

నారాయణపేట జిల్లా నారాయణపేట-దామరగిద్ద శివారులో రైతులు శుక్రవారం వివిధ పంటలు సాగు చేశారు. పత్తి, పెసర, ముంగారు జొన్నలు వేస్తున్నారు. ఇప్పటికే సాగుకు అవసరమయ్యే మేర వర్షాలు పడటంతో పొలాల్లో సందడిగా గడుపుతున్నారు. మద్దెల్‌బీడ్ శివారులో పెసర, సింగారంలో ముంగారు జొన్నలు వేశారు. కొందరు ఎద్దులతో విత్తనాలు వేయగా, పశువులు లేని వారు ట్రాక్టర్ల ద్వారా విత్తనాలు నాటారు. ట్రాక్టరుకు గంటకు వెయ్యి రూపాయలు కిరాయి అని తెలిపారు.

ఈ సారి పెరుగనున్న సాగు

ఈ వానాకాలంలో ముందస్తుగా వర్షాలు కురుస్తుండటంతో జోగుళాంబ గద్వాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు విత్తనాలు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 4,25,950 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. గత ఏడాది కంటే 55 వేల ఎకరాల్లో అదనంగా పంటలు వేయనున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ముందస్తు వర్షాలతో జిల్లాలో ఇప్పటికే 18,972 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. పంటల సాగు కోసం డీలర్ల దగ్గర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. పత్తి పంటకు సంబంధించి 1,70,115 ఎకరాలకు గాను 3,40,228 ప్యాకెట్లు అవసరం ఉండగా.. ఇప్పటికే రైతులు 72,982 ప్యాకెట్లు తీసుకెళ్లారని తెలుస్తోంది. డీలర్ల వద్ద 1,07,949 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జీలుగ విత్తనాలు 60 శాతం సబ్సిడీపై 650 క్వింటాళ్లు మంజూరుకాగా 457 క్వింటాళ్లు అమ్ముడయ్యాయి. 134 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. వరి 2,582 క్వింటాళ్లు, మొక్కజొన్న 170, కందులు 250, మిరప 82 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పంటల కోసం 1,13,922 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో యూరియా 35,134 మెట్రిక్ టన్నులు, డీఏపీ 12,919, మిగతావి 65,869 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని గుర్తించారు. ప్రస్తుతం డీలర్ల దగ్గర 50,318 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.


గట్టు మండలం ఆలూరులో ట్రాక్టర్‌తో పొలం చదును చేస్తున్న రైతు

వరుణదేవుడు కరుణిస్తాడని ఆశ



వరుణదేవుడు కరుణిస్తాడని ఎంతో ఆశతో ఉన్నాము. గత సంవత్సరం వర్షాలు పడక పంటలు సరిగా పండలేదు. తెచ్చిన పెట్టు బడులు కూడా చేతికి అందలేదు. ఈసారైనా వరుణుడు కరుణిస్తే గట్టెక్కుతాం.

- రైతు కిష్టప్ప, ఆలూరు, గట్టు

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి



రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం చూడాలి. ఈసారి వర్షాలు ముందస్తుగా కురుస్తున్నాయి. సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే కురిసిన వర్షం పొలాలను చదును చేసుకోడానికి ఉపయోగపడింది.

- రైతు ఈరన్న, తారాపురం, గట్టు మండలం

రైతులకు ఇబ్బందులు రానివ్వం

వానాకాలం పంటల ప్రణాళికను సిద్ధం చేశాం. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయి. కొరత రానివ్వం. దళారులు నాసిరకం ఎరువులు, విత్తనాలు అమ్మితే అధికారులకు సమాచారం ఇవ్వాలి. విత్తనాలు కొనేటప్పుడు రశీదులు తీసుకోవాలి. ప్రతీ క్లస్టర్‌కు ఏఈవోలు అందుబాటులో ఉంటారు. వారి సలహాలతో పంటలు సాగు చేయాలి.

- గోవిందునాయక్, జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులడు

ఎట్టకేలకు గృహజ్యోతి అమలు



- ఎన్నికల కోడ్ ముగియడంతో జీరో బిల్లులు ఇస్తున్న విద్యుత్ సిబ్బంది
- ఉమ్మడి జిల్లాలో మొత్తం విద్యుత్ కనెక్షన్లు 8,61,279
- గృహజ్యోతికి అర్హత సాధించిన కనెక్షన్లు 4,55,653
- ప్రతీ నెల విద్యుత్‌శాఖపై రూ.10కోట్ల భారం

పాలమూరు, జూన్ 7: పార్లమెంట్, ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ల నేపథ్యంలో బ్రేకులు పడిన గృహజ్యోతి పథకం.. ఇక అమలు కానుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,61,279 విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. 4,55,653 కనెక్షన్లు గృహజ్యోతికి అర్హత సాధించాయి. పథకం ప్రారంభమైన కొత్తలో రాష్ట్రం అంతటా పథకం అమలైనా కేవలం ఉమ్మడి జిల్లాలో మాత్రమే అమలు కాకపోవటం ప్రజలను ఇబ్బందికి గురి చేసింది. ఫిబ్రవరి 26వ తేదీన ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోడ్ అమల్లోకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 27న రాష్ట్రంలోని పేదలకు గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నామని, పథకం కింద 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా వాడుకోవచ్చని ప్రకటించారు. రాష్ట్రంలో పథకం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లాలో అమలవుతుందని ప్రజలు కూడా భావించారు. అధికార యంత్రాంగం కూడా ఏర్పాట్లు చేసింది. మార్చి ఒకటో తేదీన ప్రజలకు జీరో బిల్లులు అందజేయాలని విద్యుత్ అధికారులు ఆదేశించడంతో సిబ్బంది జీరో బిల్లులు ఇవ్వటం ప్రారంభించారు. మధ్యాహ్నం తరువాత ఎన్నికల కోడ్ వల్ల కొత్తగా ప్రారంభించిన పథకాలు అమలు చేయరాదని చెప్పడంతో జీరో బిల్లులు ఇవ్వటం నిలిపేశారు. మరుసటి రోజు జీరో బిల్లులు ఇచ్చిన ఇళ్లకు వెళ్లి రెగ్యులర్‌గా ఇచ్చే బిల్లులను అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఏప్రిల్ నాల్గున ముగుస్తుందని, ఆ తర్వాత పథకం అమలవుతుందని భావించారు. కానీ ఆ కోడ్ అమల్లో ఉండగానే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దాంతో పథకం అమలు మరింత జాప్యమైంది. ఈ నెల ఆరో తేదీన పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పథకాన్ని అమలు చేయనున్నారు. పథకం అమలు వల్ల విద్యుత్ సంస్థపై రూ.10 కోట్ల వరకు భారం పడనుందని అధికారులు చెబుతున్నారు.

గృహజ్యోతి విధి విధానాలు

గృహజ్యోతి పథకంలో అర్హత సాధించాలంటే ఆరు గ్యారెంటీ పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఉండాలి. దాంతో పాటు తెల్లరేషన్ కార్డు ఉండి, ఆధార్‌తో లింకు చేసుకుని ఉండాలి. విద్యుత్ వినియోగం నెలకు 200 యూనిట్లు మించినా, బిల్లులు పెండింగ్‌లో ఉన్నా పథకం వర్తించదు. 2022-23లో సగటున నెలకు 200 యూనిట్లకు మించి విద్యుత్ వాడినా పథకం వర్తించదు. గృహజ్యోతికి అర్హత పొందనివారు ఆధార్, రేషన్‌కార్డులు అప్‌డేట్ చేసుకుని ఎంపీడీవో లేదా మునిసిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది.

అర్హులు వీరే..

మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 2,39,402 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకునే కనెక్షన్లు 1,41,375 ఉన్నాయి. వాటిలో ఆధార్, రేషన్‌కార్డు అప్‌డేట్ చేసుకుని, గృహజ్యోతికి అర్హత పొందిన కనెక్షన్లు 98,007 ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

- వనపర్తి జిల్లాలో మొత్తం 2,06,710 కనెక్షన్లు ఉండగా, 200 యూనిట్ల వరకు విద్యుత్ వాడుకునే వాడుకునేవి 1,22,799 కనెక్షన్లు ఉన్నాయి. అందులో 62,961 కనెక్షన్లు గృహజ్యోతికి అర్హత సాధించాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,96,915 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 200 యూనిట్లలో లోపు విద్యుత్ వాడుకునేవి 1,62,354 కనెక్షన్లు ఉన్నాయి. అందులో 76,433 కనెక్షన్లు గృహజ్యోతి పథకం కింద ఎంపికయ్యాయి.

జీరో బిల్లులు ఇస్తున్నాం..



ఎన్నికల కోడ్ ముగియటంతో గృహజ్యోతి పథకం కింద జూన్ ఆరో తేదీ సాయంత్రం నుంచే ప్రజలకు జీరో బిల్లులు అందజేస్తున్నాం. పథకం అమలులో ఏమైనా సమస్యలుంటే సమీప విద్యుత్ ఏఈ, ఏడీ, డీఈ, ఎస్ఈ కార్యాలయాలను సంప్రదించి పరిష్కరించుకోవాలి.

- పి.వెంకటరమేష్, ఎస్.ఈ మహబూబ్ నగర్


మృగశిర కార్తె సందర్భంగా నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డులో చేపలు కొంటున్న పట్టణవాసులు



నేడు మృగశిర కార్తె

- కార్తె రాకతో వర్షాల వల్ల వాతావరణంలో మార్పులు
- చలి నుంచి ఉపశమనం కోసం మాంసాహారం తినడం ఆనవాయితీ
- పెరిగిన నాటు కోళ్ల ధరలు
- పుంజుకోనున్న వ్యవసాయ పనులు

నారాయణపేట, జూన్ 7: వర్షాకాలానికి నాంది పలికే మృగశిర కార్తె శనివారం నుంచి ప్రారంభం కానుంది. వానకాలం పంటల సాగు కోసం ఉగాది తర్వాత దుక్కిదున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు రోహిణి కార్తెలో కురిసే మోస్తరు వర్షాలకు ఆరుతడి పంటలైన కందులు, పెసర్లు వేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ సారి నారాయణపేట జిల్లాలో ముందే వర్షాలు కురియడంతో రైతులు విత్తనాలు వేస్తున్నారు. జూన్ మొదటి వారంలో వచ్చే మృగశిర కార్తె సందర్భంగా రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారు. అప్పటి వరకు వేసవి ఉక్కబోత వల్ల సతమతమైన ప్రజలు మృగశిర కార్తెలో పడే వానలకు వాతావరణం చల్లబడి ఉపశమనం పొందుతారు.

కోడి మాంసం తప్పనిసరి

మృగశిర కార్తెను గ్రామీణులు మిరుగు కార్తెగానూ అభివర్ణిస్తారు. ఆ రోజు పల్లెల్లో ప్రత్యేక వంటకాలు చేసుకుంటారు. మాంసహారులు కోడి మాంసాన్ని తప్పనిసరిగా తింటారు. చికెన్‌తో పాటు చేపలు, మటన్ కూడా తింటారు. మాంసం తినడంతో పాటు మద్యం తాగుతారు. వేసవి ముగిశాక మృగశిర కార్తెలో వచ్చే చలిని తట్టుకునేందుకు కార్తె రోజు మాంసాహారం తినడం ఆనవాయితీగా వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. శాఖహారులు తీపి వంటకాలతో పాటు ఇంగువ, బెల్లం కలుపుకుని మింగుతారు. వేడిని పెంచే ఇంగువను వంటకాల్లో వినియోగిస్తారు.

చేపల కొనుగోలు

కందనూలు: మృగశిర కార్తె సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఒక రోజు ముందుగానే ప్రజలు చేపలను కొనుగోలు చేశారు. మృగశిర కార్తె ఆరంభం నుంచి వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు తగ్గి, వివిధ రకాల వ్యాధులు సక్రమించే అవకాశం ఉంటుందని, అందుకే చేపలు తింటారని పూర్వీకులు చెబుతున్నారు. బొచ్చెలు, రౌటలు, బంగారు తీగలు వంటి రకాల చేపలు విక్రయించారు. బొచ్చెలు కిలో రూ.130 కాగా.. రౌటలు రూ.150, బంగారు తీగలు రూ.120కి విక్రయించారు.

నాటు కోడి ధర రూ.1,200

మృగశిర కార్తె నేపథ్యంలో నాటుకోళ్ల ధరలు పెరిగాయి. రెండు కిలోలకు పైగా బరువున్న కోళ్ల ధర రూ.1,200గా ఉంది. ఫారం కోళ్ల లైవ్ ధర కేజీ రూ.170గా ఉండగా, చికెన్ కేజీ రూ.240, స్కిన్‌లెస్ రూ.260గా ఉంది.

ఉరేసుకొని
వ్యక్తి ఆత్మహత్య


స్వామి (ఫైల్)

కోడేరు, జూన్ 7 : నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రవి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి స్వామి(48) అనే వ్యక్తి శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకు న్నాడు. భార్య ఈశ్వరమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రవి తెలిపారు.

మల్బరీ తోటల సాగుకు
దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా హార్టికల్చర్ అధికారి సురేష్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 7: జిల్లాలో మల్బరీ తోటల సాగు కోసం ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా హార్టికల్చర్ అధికారి సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సిల్క్ సమగ్ర పథకం 2 ద్వారా జిల్లాలో 40 ఎకరాల్లో మల్బరీ తోటల సాగుకు అవకాశం ఉందన్నారు. మల్బరీ తోటల సాగు కోసం , నీటి వసతి, షెడ్డు నిర్మాణం కోసం ఒక్కోదానిపై ప్రభుత్వం సబ్సిడీ సౌకర్యం ఉందన్నారు. జనరల్ కేటగిరి రైతులు తమ వాటాగా 50 శాతం రుసుము చెల్లిస్తే ప్రభుత్వ వాటాగా 50 శాతం చెల్లిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు తమ వాటాగా 35 శాతం రుసుము చెల్లిస్తే ప్రభుత్వం 65 శాతం అందిస్తుందన్నారు. మల్బరీ తోటల సాగుకోసం డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసుబుక్ జిరాక్స్, కుల ధృవీకరణ పత్రం, బ్యాంకు పాసుబుక్ జిరాక్స్ పాస్‌పోర్టు సైజు ఫొటో జతచేసి క్షేత్రస్థాయి అధికారులకు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అగ్ని ప్రమాదంలో దుకాణం దగ్ధం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన దుకాణం

వనపర్తి వైద్యవిభాగం, జూన్ 7: మాతా శిశు సంరక్షణ కేంద్రం దగ్గర కొమ్ము లక్ష్మి ఏర్పాటు చేసుకున్న డబ్బాకు నిప్పంటుకుని దగ్ధం అయింది. గురువారం అర్ధరాత్రి డబ్బాకు మంటలు చెలరేగడంలో అస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. డబ్బాలోని వస్తువులతో పాటు ఫ్రిజ్, రిఫ్రిజిరేటర్, జిరాక్స్ మిషన్, మిగతా వస్తువులు కాలి బూడిదయ్యాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ. 5 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రమాదానికి గల కారణాలను అధికారులు తెలుసుకొని న్యాయం చేయాలని ఆమె కోరింది. బీఆర్ఎస్ నాయకులు గంధం పరం జ్యోతి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, ఈరపోగు మన్నెం ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధితురాలికి న్యాయం చేయాలని అధికారులను కోరారు.

చెట్టెక్కిన నాగుపాము


దానిమ్మ చెట్టుపై ఉన్న పామును పట్టుకుంటున్న కృష్ణసాగర్

వనపర్తి రూరల్, జూన్ 7: వనపర్తి పట్టణంలోని తిరుమల హిల్స్‌లోని ఓ ఇంటి పరిసరాల్లోకి వెళ్లిన నాగుపాము అక్కడ ఉన్న కుక్కలను చూసి చెట్టు ఎక్కింది. ఇంటి యజమాని రవి సాగర్ గమనించి స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. అతను వెంటనే అక్కడికి చేరుకొని పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేశాడు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


అంజి(ఫైల్)

గద్వాల క్రైం, జూన్ 7 : భార్యతో గొడవపడి ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. సంఘటనపై రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేటీదొడ్డి మండలంలోని శివరంగాపూర్ గ్రామానికి చెందిన కొండాపురం అంజి(26)కి నాగమణితో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వీరు జిల్లా కేంద్రంలోని గంజిపేట కాలనీలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం వారిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అంజి పాత హౌసింగ్ బోర్డు సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

భూమి హద్దు రాళ్లను
తొలగించిన వ్యక్తులపై కేసు నమోదు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీహరి

ఖిల్లాఘణపురం, జూన్ 7: మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో ఏడీ సర్వేయర్ నిర్ణయించిన హద్దురాళ్లను తొలగించిన వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పంతుల పావని గ్రామ శివారులోని సర్వే నంబర్లు 12, 31, 32, 33లలో తన సొంత పొలంలో ఈ నెల 4న ప్రభుత్వ ఏడీ సర్వేయర్‌తో పొలం హద్దు పక్క గల రైతుల సమక్షంలో భూమి సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. ఈనెల 5న హద్దురాళ్లు పాతడంతో ఉద్దేశపూర్వకంగా పంతుల మధుకర్ రెడ్డి సర్వే సమయంలో హాజరై అదే రోజు రాత్రి హద్దురాళ్లను కూల్చివేయడంతో పాటు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తమకు సదరు వ్యక్తితో ప్రాణహాని ఉందని పంతుల పావని ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మధుకర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఖిల్లాఘణపురం, జూన్ 7: మండల కేంద్రంలోని గంగపుత్ర కాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో ని మానాజీ పేట గ్రామానికి చెందిన కప్పెట మణెమ్మ (45), ఆమె కుమార్తె అనిత అనారోగ్యంతో ఉండడంతో మండల కేంద్రంలోని ఆసుపత్రికి కుమారుడు శివతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. గంగపుత్ర కాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్‌పై కూర్చున్న మణెమ్మ ఎగిరి రోడ్డుపై పడిపోయింది. వెనుక నుంచి వస్తున్న వనపర్తి డిపోకు చెందిన ప్రైవేటు ఆర్టీసీ బస్సు మణెమ్మ ఎడమ కాలు మీద నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమె కాలు విరిగింది. సమయానికి అంబులెన్స్ రాలేదు. దీంతో తీవ్ర రక్తస్రావమై ఆమె స్పృహ కోల్పోయింది. అమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మణెమ్మకు భర్త అర్జున్, కుమారుడు శివ, కుమార్తె అనిత ఉన్నారు. బాధితురాలి బంధువు గోవర్ధన్ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ బత్తుల నాగేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

అలంపూర్ చౌరస్తా, జూన్ 7: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలో, పుల్లూరు శివారులోని జాతీయ రహదారి పై టోల్‌ప్లాజా సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అలంపూర్ మండల పరిధిలోని కోనేరు గ్రామానికి చెందిన వీరన్ననాయుడు (50) ద్విచక్రవాహనం పై టోల్‌ప్లాజా వద్ద రోడ్డుపైకి వస్తుండగా, కర్నూలు వైపు నుంచి వస్తున్న కొల్లాపూర్ డిపోకు చెందిన బస్సు ఢీకొన్నది. ప్రమాదంలో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఉండవల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ట్రాక్టర్ ఢీకొని మేకల కాపరి మృతి

బల్మూరు, జూన్ 7 : ట్రాక్టర్ ఢీకొని మేకల కాపరి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై బాలరాజు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అంబగిరి గ్రామానికి చెందిన హరిలాల్ అనే వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్‌పై సైదులు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సైదులు అంబగిరి గ్రామం నుంచి అచ్చంపేటకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా మైలారం గ్రామ సమీపంలోని అడ్డగొంక రోడ్డు మలుపు వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే మేకలను కాస్తున్న కాపరి కటికర్ల చంద్రయ్య(40)ను ఢీకొట్టింది. దీంతో రోడ్డు పక్కన కాల్వలో ట్రాక్టర్ పడిపోగా, చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో అల్లీపూర్ మాజీ సర్పంచ్ మృతి

మహబూబ్‌నగర్, జూన్ 7 : అల్లీపూర్ మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌గౌడ్(60) గుండెపోటుతో మృతిచెందాడు. మండలంలోని అల్లీపూర్‌కు చెందిన రాజేశ్వర్‌గౌడ్ గురువారం రాత్రి భోజనం చేశాక గ్రామంలోని ఇంటిముందు వాకింగ్ చేసి పడుకునేందుకు సిద్ధం అవుతుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దగ్గు, ఆయాసం రావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. ఈయన సోదరుడు మాజీ సర్పంచ్ అల్లీపూర్ సురేశ్‌గౌడ్ కూడా ఇదివరకు గుండెపోటుతోనే మరణించడం గమనార్హం. రాజేశ్వర్‌గౌడ్ ఇదివరకు గ్రామ సర్పంచ్‌గా, సింగిల్‌విండో చైర్మన్‌గా పనిచేశారు. ఈయనకు ఇద్దరు కొడుకులు శుక్రవారం గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు.

హుండీ లెక్కింపు

మహమ్మదాబాద్, జూన్ 7 : మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామంలోని వీర హనుమాన్ దేవాలయం హుండీని శుక్రవారం ఆలయ కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించారు. హుండీని లెక్కించగా రూ. రెండు లక్షలా ఇరవై వేల రూపాయలు కానుకలు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పొంగి పొర్లిన వాగులు

- అలంపూర్, ఉండవల్లి మండలాల్లో భారీ వర్షం
- వివిధ గ్రామాల్లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

ఉండవల్లి, జూన్ 7 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి, అలంపూర్ మండలాల్లో గురువారం రాత్రి, శుక్రవారం భారీ వర్షం పడింది. ఉండవల్లి మండల కేంద్రంతో పాటు భైరాపురం, బస్వాపురం, అలంపూర్ చౌరస్తా, పుల్లూరు, చిన్న ఆముదాలపాడు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ప్రాగటూర్, శేరుపల్లి, తక్కశిల, మారమునగాల గ్రామాల్లో తేలికపాటి వర్షం పడింది. మండలంలో 34.2 మిమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. భైరాపురం బీసీ కాలనీలో నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి మోకాలి లోతు నీరు నిలవడంతో, శుక్రవారం మోటర్ల సహాయంతో తొలగించారు. సాయంత్రం తిరిగి వర్షం కురవడంతో అదే పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉండవల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న నీలమ్మ వాగు పొంగిపొర్లింది. దీంతో అనసూయమ్మ కాలనీ వాసులు భయాందోళనలకు గురయ్యారు. పుల్లూరులో ఓ కాలనీలోని రోడ్లపై రెండు అడుగుల మేర వర్షపునీరు ప్రవహించింది. చిన్న ఆముదాలపాడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షం ధాటికి పంట పొలాలు కోతకు గురయ్యాయి. అలంపూర్ మండలంలోని లింగనవాయి, క్యాతూరు, కోనేరు, బుక్కాపురం గ్రామాల్లో వీధులు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

రేవల్లిలో 98.0 మిల్లీ మీటర్ల వర్షం

వనపర్తి అర్బన్ : వనపర్తి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. జిల్లాలోని అమరచింత, వనపర్తి, రేవల్లి, పాన్‌గల్ మండలాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా రేవల్లిలో 98.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. పాన్‌గల్‌లో 33.5, చిన్నంబావి 21.8, మదనాపూర్ 18.0, వీపనగండ్ల 12.5, ఘనపూర్ 6.8, గోపాల్‌పేట 5.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది.

కోడేరులో 18.2 మిల్లీ మీటర్ల వర్షం

కోడేరు : రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పుడమి తల్లి పులకించింది.కోడేరు మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. మండల పరిధిలోని బావాయిపల్లి వాగు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహించింది. వర్షాకాలం ప్రారంభంలోనే రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రైతులు తమతమ పొలాలను చదును చేసి విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధమయ్యారు. గురువారం రాత్రి మండలంలో 18.2 మి.మీ. వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

గుండుమాల్‌లో 69.5 మిల్లీ మీటర్లు

నారాయణపేట : నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా గుండుమాల్‌లో 69.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కోస్గిలో 0.5మి.మీ. వర్షపాతం నమోదైంది. దామరగిద్ద మండలం మొగలమడ్కలో 52.3 మీ.మీ., మక్తల్ మండలం జెక్లెర్‌లో 51.5 మీ.మీ., ఊట్కూర్‌లో 41.5 మీ.మీ., బిజ్వార్‌లో 1.0మీ.మీ., నారాయణపేట మండలం చిన్నజట్రంలో 20.8మీ.మీ., కోటకొండలో 2.5మీ.మీ., నర్వ, మక్తల్‌లో 16.5మీ.మీ., కొత్తపల్లిలో 15.0మీ.మీ., నారాయణపేటలో 10.8మీ.మీ., మరికల్‌లో 9.8మీ.మీ., మాగనూర్‌లో 6.8 మీ.మీ., మద్దూరులో 3.3మీ.మీ., కృష్ణలో 1.5మీ.మీ., ధన్వాడలో 0.85మీ.మీ. వర్షపాతం నమోదు అయింది.


అలంపూర్ మండలం లింగనవాయి గ్రామం ప్రధాన వీధివెంట దీవిని తలపిస్తున్న వరదనీరు

పిడుగుపాటుకు ఇద్దరు మృతి


బోరబండ ఆశన్న


బోరబండ కౌసల్య

దామరగిద్ద, జూన్ 7: పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం విఠలాపూర్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బోరబండ ఆశన్న, భార్య సైదలమ్మ, కొడుకు బీమ్మప్ప, కోడలు లక్ష్మి, ఆశన్న తమ్ముడి భార్య బోరబండ కౌసల్య, అలాగే ఇద్దరు చిన్నారులు వ్యవసాయ పొలంలో పత్తి విత్తనాలు వేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో వర్షం రావడంతో అందరు సమీపంలోని గుండు కిందకు వెళ్లారు. ప్రమాదవశాత్తు పిడుగు పడి బోరబండ ఆశన్న(58), బోరబండ కౌలస్య (54) అక్కడికక్కడే మృతి చెందారు. ఆశన్న భార్య సైదలమ్మ, చిన్నారులకు గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు వీరిని నారాయణ పేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నేలకూలిన చెట్లు

ఊట్కూర్ : మండలంలోని ఎడవెల్లి, చిన్నపొర్ల, మల్లెపల్లి, పెద్దపొర్ల, ఊట్కూర్, తిప్రస్‌పల్లి గ్రామంలో జోరుగా వర్షం కురవగా, బిజ్వార్, కొత్తపల్లి, అవసులోన్‌పల్లి గ్రామాల్లో చినుకల వర్షం కురిసింది. సాయంత్రం కురిసిన వర్షానికి ఆయా గ్రామాల్లో చెరువుల్లో ఒక స్థాయిలో నీరు వచ్చి చేరింది. కురవడంతో మిగిలిన రైతులు విత్తనాలు పెట్టడానికి సిద్ధమవుతు న్నారు. పొలాల్లో గాలివానకు చెట్లు నేలకూలాయి. గ్రామాల్లో కాల్వలు పొంగి పొర్లాయి. వారంలో రెండుసార్లు వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది.

కోస్గిలో లోతట్టు ప్రాంతాలు జలమయం

కోస్గి : కోస్గిలో ఒక్కరోజు కురిసిన వర్షానికి లోతట్టుప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలైన బృందావన్‌కాలనీ, హనుమాన్‌నగర్, డీటీసీపీ లేఅవుట్ శ్రీనివాస కాలనీల్లోకి వర్షపునీరు చేరింది. డ్రైనేజీలు సరిగాలేకపోవడంతో ఇళ్ల మధ్యకు వర్షపు నీరు చేరింది. శ్రీనివాసకాలనీ ప్లాట్ల మధ్య వర్షపునీరు చేరింది. లోతట్టు ప్రాంతాలలో పాటు కాలువలను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం, మునిసిపల్ డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలనీల్లోని పాటుకాలువలను యథావిధిగా తీయిస్తే ఇబ్బందులు ఉండవని పట్టణవాసులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు పశువులు మృతి

నవాబ్‌పేట/గండీడ్ : నవాబ్‌పేట, గండీడ్ మండలాల్లో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడి పశువులు మృతిచెందియి. నవాబ్‌పేట మండలం లింగన్నపల్లి గ్రామ సమీపంలో లాలు అనే రైతు వర్షం రావడంతో తన ఐదు గేదెలను పొలం వద్ద ఉన్న మర్రి చెట్టుకింద కట్టేసి ఇంటికి వచ్చాడు. పిడుగులు పడటంతో చెట్టుకింద ఉన్న ఆ ఐదు గేదెలు మృతి చెందాయి. దీంతో లాలుకు రూ.ఐదు లక్షల నష్టం జరిగిందని బాధిత రైతు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. అలాగే మండల కేంద్రమైన గండీడ్‌లో కుక్కరాల గుట్ట సమీపంలో వేపూరి చెన్నయ్య అనే రైతు తమ పొలం దగ్గర ఆవులను, గేదెలను కట్టేశాడు. శుక్రవారం సాయంత్రం పిడుగు పడడంతో ఆవు మృతి చెందినట్లు తెలిపారు. చెన్నయ్యకు విజయడెయిరీ వారి ఆధ్వర్యంలో బ్యాంకు నుంచి లక్ష రుణంతో ఈ ఆవును తీసుకున్నాడు. పశువైద్య సిబ్బంది, తహసీల్దార్ సిబ్బంది వచ్చి పంచనామా చేశారు.

● మండల పరిధిలోని చిన్న పగిడ్యాల్ గ్రామంలో చిన్న బసప్ప ఇంటిపై శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో పిడుగు పడిందని గ్రామస్థులు తెలిపారు. దీంతో ఇంటి పైకప్పు రంధ్రం పడిందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.


చిన్న ఆముదాలపాడు ప్రధాన రోడ్డుపై పారుతున్న నీలమ్మ వాగు


కోడేరు : వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తున్న బావాయిపల్లి వాగు


గండీడ్‌లో పిడిగు పాటుకు మృతి చెందిన ఆవు


నవాబ్‌పేట : మృతి చెందిన గేదెలు

చెంచుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఐటీడీఏ పీవో రోహిత్‌గోపిడీ

బల్మూరు, జూన్ 7 : చెంచు గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి అవసరాలను క్షుణ్ణంగా గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఐటీడీఏ పీవో రోహిత్‌గోపిడీ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని చెంచుగూడెం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగ గ్రామ చెంచులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వ్యవసాయానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు, పట్టా పాస్ పుస్తకాలు, బోరుబావులు, ఇతర రుణాలను ఆయన వారినడిగి తెలుసుకున్నారు. అనంతరం చెంచులు ఇచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు

భూత్పూర్, జూన్ 7 : రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన 44వ జాతీయ రహదారిపైన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటిపర్తి చెందిన ఎనిమిది మంది అదే గ్రామానికి చెందిన ఆటోలో సొంత గ్రామానికి వెళుతుండగా శేరిపల్లి(బీ) గ్రామ శివారులో ఆటోను గద్వాల నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి అదుపు తప్పి ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న తాటిపర్తి గ్రామానికి చెందిన రాము, లక్ష్మణ్, ఇమ్రాన్, చంద్రమ్మ, స్వాతి, శ్రీనిధి, సలోమియా, ఆటో డ్రైవర్ ఖాజా మొత్తం ఎనిమిది మందికి తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఆటో డ్రైవర్ ఖాజాకు కాలు విరిగింది, ఇమ్రాన్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

అమ్రాబాద్ : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట పట్టణానికి చెందిన కౌసల్య ఎలక్ట్రానిక్ షాపు యజమాని పులిజాల రమేష్ తన కుటుంబ సభ్యులతో మద్దిమడుగు ఆలయానికి ఇన్నోవా కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా కుమ్మరోనిపల్లి సమీపంలో ఉన్న బ్రిడ్జిపై కారు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రమేష్, ఆయన తల్లి కౌసల్యకు తీవ్ర గాయాలు కాగా, కుటుంబీకులు ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు అతివేగంగా ప్రయాణించడం మూలంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

బెల్లం పట్టివేత

కల్వకుర్తి టౌన్, జూన్ 7 : నాటుసారా తయారీకి ఉపయోగించే రూ.మూడు లక్షలు విలువైన బెల్లాన్ని శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ గంజ్ మార్కెట్ నుంచి కారులో బెల్లాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో ఈఎస్‌డీ గాయత్రి ఎక్సైజ్ పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో వారు కల్వకుర్తి పట్టణంలోని కుర్మిద్ద రోడ్డులో కారును ఆపి తనిఖీలు చేశారు. కారులో 12 బ్యాగుల్లో 360 కిలోల బెల్లాన్ని, 40 కిలోల ఆలం, నాలుగు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బెల్లం, ఆలం, కారు విలువ రూ.మూడు లక్షలు ఉంటుందని సీఐ జి.వెంకట్‌రెడ్డి తెలిపారు. కేసులో కొత్తపల్లి తండాకు చెందిన కాత్రవత్ రవి, వెంకటాపూర్ తండాకు చెందిన జగన్ నాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. పట్టుబడిన బెల్లం వెంకటాపూర్‌తండాకు వెళుతుందని పేర్కొన్నారు. దాడిలో సిబ్బంది మహేష్, రఘు, భిక్షపతి ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కల్వకుర్తి టౌన్, జూన్ 7 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని నాగర్‌కర్నూల్ చౌరస్తాలో శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారులు, పోలీసులు రెండు బొలెరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 27 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది, కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి వాహనాల తనిఖీలు నిర్వహించారు. బల్మూర్ మండలానికి చెందిన రేషన్ బియ్యాన్ని ప్రజల వద్ద తక్కువధరకు కొని ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా పట్టుకున్నారు. తుమ్మన్‌పేట గ్రామానికి చెందిన వాహన యజమానులు సయ్యద్‌బాషా, బతికే మల్లేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

దేవరకద్ర, జూన్ 7 : అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. మండల పరిధిలోని గురకొండ గ్రామంలో సమీపాన ఉన్న వాగు నుంచి రాత్రి ట్రాక్టర్ ద్వారా నుంచి ఇసుకను తరలిస్తుండగా గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందిచడంతో పోలీసులు అక్కడికి చేరుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ

- రెండు బంగారు పతకాలు సాధించిన మహేశ్వరి


బంగారు పతకం సాధించిన మహేశ్వరి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 7 : హన్మకొండలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో టోర్నీలో మహిళ విభాగంలో జిల్లా క్రీడాకారిణి మహేశ్వరి అద్భుత ప్రతిభ చాటింది. మూడు వేల స్టీపుల్‌చేజ్, 1500 మీటర్ల పరుగుపందెంలో రెండు బంగారు పతకాలు సాధించింది. పతకాలు సాధించడం పట్ల ద్రోణాచార్య అవార్డు గ్రహీత, అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అల్లీపూర్ క్రీడాకారుడి ప్రతిభ


ప్రశంసా పత్రాలతో అల్లీపూర్ నవీన్

చిన్నచింతకుంట, జూన్ 7 తెలంగాణ రాష్ట్రస్థాయి 10వ అథ్లెటిక్స్ పోటీల్లో మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన డి.నవీన్ మూడు పతకాలు సాధించారు. ఈనెల ఆరు, ఏడు తేదీలలో వరంగల్ జిల్లా హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్-2024 పోటీలలో సీనియర్ కేటగిరీల్లో డెకతలోన్ విభాగంలో నవీన్ మొదటి విజేతగా నిలిచి, బంగారు పతకం సాధించాడు. అదేవిధంగా 110 మీటర్ల హార్డిల్స్ విభాగంలో కూడా తృతీయ విజేతగా నిలిచి కాంస్య పతకం సాధించాడు. అదే విధంగా 400 మీటర్స్ రిలే రిన్నింగ్ విభాగంలో ద్వితీయ వేజేతగా నిలిచి రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా నవీన్‌ను మహబూబ్‌నగర్ జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి ఎస్.శ్రీనివాసులు, మాజీ తెలంగాణ స్పోర్ట్ అథారిటీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘుర్ధన్‌గౌడ్, గ్రామస్థులు అభినందించారు.

గుర్రాల దాడిలో ఒకరికి గాయాలు

మహమ్మదాబాద్, జూన్ 7 : మండల పరిధిలోని ముకర్లబాద్ గ్రామంలో గుర్రాల దాడిలో ఓ వ్యక్తికిగ ఆయాలయ్యాయి. రెండు రోజుల క్రితం గ్రామానికి మూడు గుర్రాలు వచ్చాయి. శుక్రవారం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గొల్ల కృష్ణయ్య కుమారుడు గొల్ల అరవింద్ (12)పై అవి దాడి చేసి కరిచాయి. బాలుడికి తీవ్రగాయాలు కావడంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు బంధువులు తెలిపారు. గతంలో కూడా ఇవే గుర్రాలు వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని ఘనపురం గ్రామంలో పలువురిపై దాడి చేసి గాయపరిచినట్లు గ్రామస్థులు తెలిపారు. అధికారులు దృష్టి సారించి గుర్రాల నుంచి రక్షించాలని కోరుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెక్సిన్ దుకాణం దగ్ధం


దగ్ధమవుతున్న రెక్సిన్ దుకాణం

మహబూబ్‌నగర్, జూన్ 7 : మహబూబ్‌నగర్ పట్టణంలోని రెక్సిన్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అలుముకున్నాయి. దుకాణం యజమాని శుక్రవారం మధ్యాహ్నం లంచ్‌కు వెళ్లిన తరువాత దుకాణంలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంటలు రెక్సిన్ కవర్లకు అంటుకోవడంతో వేగంగా మంటలు వ్యాపించాయి. నిమిషాల్లోనే దుకాణం మొత్తం తగల బడింది. స్థానికులు అగ్నిమాపక శాఖకు ఫోన్ చేయడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని అగ్నిమాపక వాహనం సాయంతో మంటలను ఆర్పారు. అప్పటికే దుకాణంలో ఉన్న సామగ్రి కంప్యూటర్ మొత్తం తగలబడిపోయింది. ఈ దుకాణం రాయిచూర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉండటంతో స్థానికులు, వాహనదారులు పెద్దఎత్తున గుమికూడారు. పక్కనే అమ్మవారి దేవాలయం, మరోవైపు రెక్సిన్ దుకాణం ఉన్న అప్రమత్తం కావడంతో ఆ దుకాణానికి ప్రమాదం తప్పింది.

విద్యార్థులకు అభినందనలు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 7 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో 7.0 జీపీఏ సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వ కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా ఇంటర్ విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించింది. 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలులో కలెక్టర్ జి. రవినాయక్ ప్రవేశ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు ఎంపికైన విద్యార్థులు ఉచితంగా ఎంసెట్ శిక్షణతో కూడిన ఇంటర్ విద్యను అభ్యసించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరంలో ఫేజ్-1లో వివిధ కేటగిరీలలో ఎస్సీ-19, బీసీ-15, మైనారిటీ-01, ఎస్టీ-11, దివ్యాంగులు-02, సీట్లను కేటాయించినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్ల నిర్మూలన జవాన్‌ల బాధ్యత

- మునిసిపల్ సిబ్బందితో కమిషనర్ సమీక్ష

మహబూబూబ్‌నగర్, జూన్ 7 : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కఠినంగా వ్యవహరించి, వాటి వాడకం తగ్గించే బాధ్యత తీసుకోవాలని మునిసిపల్ జవాన్‌లను కమిషనర్ మహేశ్వర్ ఆదేశించారు. ఎక్కడా ప్లాస్టిక్ విక్రయాలు చేసినా కఠినచర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే చాలా రోజులుగా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నా ఇంకా చాలామంది వాటిని వినియోగిస్తున్నారని, అందుకే జవాన్‌లకు టార్గెట్‌లు విధించాలని నిర్ణయించారు. వార్డులలో తిరిగే జవాన్‌లు ఎక్కడికక్కడా వీటిపై తనిఖీలు చేపట్టి లక్ష్యాల మేరకు పని చేయాలని సూచించారు. శుక్రవారం మునిసిపల్ సమావేశ మందిరంలో శానిటరీ అధికారులు, మునిసినల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ నిషేధంపై ప్రతీ ఒక్కరు సీరియస్‌గా దృష్టి సారించాలని కోరారు. వ్యాపారులు, ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. మాంసం, చికెన్ కొనుగోళ్లకు వెళ్లే ప్రజలు టిఫిన్ డబ్బాలు తీసుకెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. అదే విధంగా వర్షాలు కురుస్తున్నందున వరదనీటి కాలువలు శుభ్రం చేయాలని చెప్పారు. ఎక్కడా కాలువల్లో చెత్తాచెదారం లేకుండా శానిటరీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. లేదంటే కాలువలు పొంగిపొర్లి ఇళ్లలోకి వరదనీరు చేరే ప్రమాదం ఉన్నదని వెల్లడించారు. దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేయించాలని, స్ప్రేలతో పిచికారి చేయించాలని అన్నారు. ఇక కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున ప్రజల్లో ఆందోళన ఉందని పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టీడీగుట్ట, పోలీస్‌లైన్ ప్రాంతంలో ఒకే కుక్క పది మందిని కరిచిందని, దీంతో ప్రజల్లో భయాందోళన నెలకొన్నదని తెలిపారు. అందుకే కుక్కలను పట్టేవాళ్ళు వచ్చారని, కుక్కలను పట్టించి ఫ్యామిలీప్లానింగ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, శానిటరీ అధికారులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం

- వీరన్నపేట డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీని పరిశీలించిన మునిసిపల్ చైర్మన్



డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్, జూన్ 7 : పట్టణంలోని వీరన్నపేట డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. కాలనీలో డ్రైనేజీతోపాటు ఇతర అన్ని సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం ఆయన మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అధికారులతో కలిసి వీరన్నపేట డబుల్‌బెడ్‌రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు పలు సమస్యలను చైర్మన్, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీలు లేకపోవడంతో నీళ్లను రోడ్లపైకి వదలాల్సి వస్తుందని, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని కోరారు. విద్యుద్దీపాలు వేయించాలని, రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ కాలనీలో అన్ని సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

- కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులను అభినందించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 7 : ఆత్మరక్షణ కోసం బాలికలు, విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్‌కే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించి బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో బెల్టులు సాధించిన విద్యార్థులను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు కరాటే, క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కరాటే విద్యార్థులు ప్రతిభ చాటి బెల్టులు సాధించాలన్నారు. కరాటే, యోగా, కింగ్‌బాక్సింగ్ తదితర క్రీడాంశాల్లో విద్యార్థులకు శిక్షణ అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌కే స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ రవికుమార్, అడ్వైజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వచ్చే నెల 27న మాదిగల ఆత్మగౌరవ కవాతు



ఐక్యత ప్రదర్శిస్తున్న మాదిగలు

పాలమూరు, జూన్ 7 : ఎంత ప్రతిష్టాత్మకంగా జూలై ఏడవ తేదీన వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు షైలారం శ్రీరాములు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఏర్పడి 30ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి పల్లె, గ్రామం నుంచి ప్రత్యేకంగా కమిటీలు వేసుకుని బాధ్యతగా మాదిగలను తరలించాలని పిలుపునిచ్చారు. పోలే వాలయ్య, బాలరాజు, సువార్తమ్మ, ప్రభాకర్, కొండన్న, ఆంజనేయులు, జంగయ్య, కాన్షీరాం, శాంతన్న, ఖాదరయ్య, రాములు, కేశవులు, వినోద్, రాజు, సురేష్, శివ, బాలు, వెంకటేష్, ఊశన్న పాల్గొన్నారు.

పలు పెట్రోల్ పంపుల్లో తనిఖీలు

- లీగల్ మెట్రాలజీ శాఖ జిల్లా అధికారి పి. రామకృష్ణ



పెట్రోల్ పంపులో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి. రామకృష్ణ

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), జూన్ 7 : పెట్రోల్ బంక్‌లపై అందుతున్న సీఆర్‌వో సంస్థ ఫిర్యాదు నేపథ్యంలో లీగల్ మెట్రోలజీ శాఖ జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి పి. రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పలు పెట్రోల్ పంపులలో తనిఖీలు నిర్వహించారు. అందులో ముఖ్యంగా లక్ష్మీనరసింహ ఫిల్లింగ్ స్టేషన్, బృదావన ఫిల్లింగ్ స్టేషన్, సఫా ఫిల్లింగ్ స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎటువంటి ఉల్లంఘనలు బయల్పడలేదు. ఈ సందర్భంగా పెట్రోల్ పంపు వారు ప్రతీ రోజు తమ పెట్రోల్ పంపులు సరిగా పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని పెట్రోల్ లేదా డీజిల్ డెలివరీ ద్వారా నిర్ధారించుకొన్న తర్వాతే వారి పంపులను వాడాలని సూచించారు. వారి పంపులకు ప్రతీ సంవత్సరం విధిగా వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ సర్టిఫికెట్ కాల పరిమితి ముగిసిన తర్వాత వాడినట్లైతే వారిపై కేసు నమోదవుతుందని ఆయన హెచ్చరించారు. వినియోగదారులు కోరినట్లైతే ఐదు లీటర్ల క్యాన్‌తో డెలివరీలను చెక్ చేసి చూపించాలని ఆయన సూచించారు. పై నిబంధనలు ఉల్లంఘించినట్లైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు వారికి ఎటువంటి కంప్లైంట్ ఉన్నా లీగల్ మెట్రాలజీ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చని, లేదా వాట్సప్ ద్వారా ఫోన్ నెంబర్ 9010651783కు కంప్లైంట్ నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలి

- వివిధ విభాగాల అధికారులతో సమీక్షించిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 7 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులు, రూట్ ఆఫీసర్లకు గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నీ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అభ్యర్థులను పూర్తిస్థాయిలో తనిఖీ చేశాకే లోపలికి అనుమతించాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను పరిశీలించాలని, ఐడెంటిఫికేషన్ అధికారులు అభ్యర్థుల ఐడీ కార్డులు, హాల్ టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎవరికీ మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని తెలిపారు. మెడికల్ టీమ్, ఆర్టీసీ, మునిసిపల్, ఇతర శాఖల అధికారులతో మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో చేపట్టాలని పనుల గురించి వివరించారు. జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని, 15,199 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పరీక్ష ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్ష రాసే అభ్యర్థులకు కొన్ని సూచనలు, జాగ్రత్తలు పాటించాలని కోరారు. హాల్ టికెట్ రానివారు వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌పై ఉన్న అంశాలను, సూచనలు చదివి అవగాహన చేసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాలు తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌లు సంఘటనలు జరిగినా కలెక్టర్, టి.జి.పి.ఎస్.సికి సమాచారం అందించాలని అన్నారు. అదనపు ఎస్పీ పి. రాములు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ శాఖ ద్వారా ప్రశాంతంగా పరీక్ష నిర్వహణకు భద్రత, ట్రాఫిక్, క్యూలైన్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతీ రూట్‌కు ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఆర్మ్ గార్డ్‌లు ఉంటారని, స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు కాన్ఫిడెన్షియల్ మెటీరియల్‌ను రవాణా చేసేందుకు ఎస్కార్ట్‌గా ఉంటారని అన్నారు. ఉదయం 5 గంటలకు స్ట్రాంగ్ రూమ్ వద్ద రిపోర్ట్ చేస్తారని తెలిపారు. ప్రతి కేంద్ర వద్ద ఎస్.ఐ, నలుగురు కానిస్టేబుల్స్ విధులు నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో టీజీపీఎస్సీ రీజినల్ కో-ఆర్డినేటర్ నాగరాజు, అధికా సుజీవన్ పాల్గొన్నారు.

అభ్యర్థులకు సూచనలు

- అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఆ తర్వాత వస్తే పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.
- మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు
- హాల్ టికెట్లు రాని అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి
- అభ్యర్థులు బ్లాక్ లేదా బ్లూ పాయింట్ పెన్ (లేటెస్ట్), ఒరిజినల్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అతికించిన హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన వ్యాలిడ్ ఒర్జినల్ ఫొటో ఐ.డి. కార్డు మాత్రమే కేంద్రంలోకి తీసుకరావాలి.
- అభ్యర్థి ప్రింటెడ్ ఫొటో గ్రాఫ్, సంతకం ఉన్న హాల్‌టికెట్ మాత్రమే వ్యాలిడ్‌గా పరిగణిస్తారు.
- అభ్యర్థి పరీక్ష కేంద్రం హాల్ లోపలికి వెళ్లేందుకు హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన పాస్ పోర్ట్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డు, ఆధార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగి ఐడీ లేదా డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదైన ఒక ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలి.
- పరీక్ష కేంద్రంలోకి క్యాలిక్‌లేటర్లు, పేజర్లు, సెల్ ఫోన్లు, టాబ్స్, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్ డివైజ్‌లు, వాచ్‌లు, మ్యాథమెటికల్ టేబుల్స్, లాక్‌బుక్కులు, లాగ్ టేబుల్స్ తీసుకురాకూడదు.
- అభ్యర్థులు బూట్లు కాకుండా చెప్పులు మాత్రమే వేసుకొని రావాలి.
- పరీక్ష కేంద్ర వదిలి వెళ్లే ముందు తప్పనిసరిగా ఓఎంఆర్ ఆన్సర్ సీట్లను అప్పగించి వెళ్లాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రలో ఉదయం 9.30 గంటల నుంచి అభ్యర్థుల బయోమెట్రిక్ ప్రాంభం అవుతుంది. అందువల్ల తప్పనిసరిగా బయోమెట్రిక్ ఇవ్వాలి. అభ్యర్థులు పరీక్ష కేంద్రం గేటు మూసే సమయం కంటే గంట ముందుగాను పరీక్ష కేంద్రానికి రిపోర్ట్ చేయాలి.

-అవసరమైతే ఇన్విజిలేటర్ ద్వారా అభ్యర్థులు సమయాన్ని తెలుసుకోవచ్చు.

న్యాయ చట్టాలపై అవగాహన

- జిల్లాన్యాయ అధికార సేవాసంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి డి.ఇందిర



విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

మహబూబ్‌నగర్, జూన్ 7 : బాలల సంరక్షణకు ఉన్న న్యాయచట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లాన్యాయ అధికార సేవాసంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి డి.ఇందిర అన్నారు. శుక్రవారం ఏనుగొండలోని అనాథాశ్రమాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. బాల్యవివాహాలు, బాలల విద్య, బాలల హక్కులతో పాటు న్యాయచట్టాలను వివరించారు. ఈ సందర్భంగా బాలలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఏనుగొండ శాంతివన్‌ను సందర్శించి అక్కడ భోజనం, వంటశాల, వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనాథాశ్రమం సూపరింటెండెంట్ వెంకటేశ్వరమ్మ, లయన్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● నేడు జాతీయలోక్ అదాలత్ : జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయసేవాసదన్ భవనంలో లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఇప్పటికే కక్షిదారులతో ఈ విషయంపై పోలీసులు మాట్లాడి రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు అవగాహన కల్పించారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం



కోయిలకొండలో యూనిఫాంలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో నర్సిములు

- డీఆర్‌డీవో నర్సింములు

కోయిలకొండ, జూన్ 7 : గ్రామాల్లోని మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యమని డీఆర్‌డీవో నర్సింములు అన్నారు. శుక్రవారం మండలంలోని గార్లపాడ్, కోయిలకొండలో పాఠశాల విద్యార్థులకు ఐకేపీ వారు కుడుతున్న యూనిఫాం దుస్తులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఉపాధి కల్పన కోసం డీఆర్‌డీవో ద్వారా టైలరింగ్ ఇతర చేతి వృత్తుల పనుల కోసం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పాఠశాల యూనిఫాం దుస్తుల కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బడులు ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాం అందించనున్నట్లు తెలిపారు. మండలంలో గార్లపాడ్, పారుపల్లి, కోయిలకొండ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు మూడు వేల దుస్తులు సిద్ధం చేశామని, మరో 1500ల దుస్తులు 12వ తేదీ వరకు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీఎం విజయకుమారి, ఏపీవో నర్సయ్య ఐకేపీ సీసీలు మల్లేష్, నరేష్, సంతోష్ బుక్‌కీపర్‌లు రజిత, వెంకటేష్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

- కోడ్గల్‌లో బడిబాటలో ఎంఈవో మంజులాదేవి



జడ్చర్ల : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో మంజులాదేవి

జడ్చర్ల, జూన్ 7 : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జడ్చర్ల ఎంఈవో కె.మంజులాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కోడ్గల్ జడ్పీహెచ్ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామంలో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, ఇందుకోసం గ్రామంలోని ప్రజలు, యువత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ నెల 12న వంద శాతం హాజరు ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ బడిలో చదివే పిల్లలకు ప్రభుత్వం ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఐదుగురు విద్యార్థులు పాఠశాలలో అడ్మిషన్ పొందారని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ మమత, ఉపాధ్యాయులు స్లీవారెడ్డి, అమరేందర్‌రెడ్డి, శశిధర్, శ్రీనివాసులుశెట్టి, శరణప్ప, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, సభ్యులు, అమర్‌నాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెలుగు మీడియం పాఠశాలలో : పట్టణంలోని జడ్చర్ల తెలుగు మీడియం పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ రాజు, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమానికి చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు అనురాధ, సువర్ణ, ఏఏపా కమిటీ చైర్మన్ మంగ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

రాజాపూర్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని శుక్రవారం రెండవ రోజు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గ్రామాల్లో ఐదు నుంచి 15 సంవత్సరాల విద్యార్థులందరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాను అందిస్తున్నామని, ప్రతి సంవత్సరం ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలో పదోవ తరతగతిలో విద్యార్థులందరు మెరుగైన ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రాజాపూర్ : బడిబాటలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొనసాగుతున్న బడిబాట

నవాబ్‌పేట : మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశానుసారం మండలంలో బడిబాట కార్యక్రమం కొనసాగింది. పుట్టోనిపల్లిలో పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మరికంటి బాలరాజు ఆధ్వర్యంలో బడిబాట కార్యకమం నిర్వహించి చదువు ఆవశ్యకతను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. సిద్దోటం గ్రామంలో బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు మరికంట రాములు ఆధ్వర్యంలో గ్రామస్థులకు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలోకి కాకర్లపాడ్ గ్రామంలో తెలంగాణ పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాటలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పోమాల గ్రామంలో హెచ్‌ఎం సదాశివుడు ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆ తండాలకు వెళ్లాలంటే తండ్లాటే..

- నిధులున్నా.. ప్రారంభం కాని పనులు


- లింబ్యాతండా, చేదుఘట్‌తండాల రహదారి దుస్థితి

మిడ్జిల్, జూన్ 7 : కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారినుంచి మండలంలోని లింబ్యాతండా, చేదుఘట్‌తండాలకు వెళ్లే రహదారి పాదచారులకు ఇబ్బందిగా మారింది. నాలుగు కిలోమీటర్లే అయినప్పటికీ పాదచారులు, ద్విచక్రవానదారులు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఏర్పడటంతో చిన్నపాటి వర్షానికే రోడ్డుమొత్తం చిత్తడిగా మారుతుంది. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని ఆయా తండాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తండాలకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ. 2కోట్ల 50 లక్షలు మంజూరయ్యాయని తెలిసింది. నిధులు ఉన్నా ఇప్పటి వరకు పనులుప్రారంభించలేదు. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయుంగా మారిన లింబ్యాతండా రోడ్డు

బీటీ రోడ్డు మంజూరైందని సంతోషించాం



మా తండాలకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిస్తే అందరం సంతోషించాం. నిధులు మంజూరయ్యాయి కానీ, ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలి.

- కొర్రవత్ గోవింద్, చేదుఘట్‌తండా

చాలాసార్లు ప్రమాదాలు జరిగాయి



రోడ్డుబాగాలేక చాలాసార్లు ద్విచక్రవాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురయ్యారు. వర్షాకాలంలో రోడ్డుమొత్తం బురదమయమై నడువలేని పరిస్థితి ఉంటుంది. బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనందున పనులు చేపట్టాలి.

- కాట్రావత్ గోపాల్‌నాయక్, లింభ్యాతండా

'పట్టా భూమిని అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

జడ్చర్ల, జూన్ 7 : తమకు తెలియకుండా తమ భూములను విక్రయించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం వివరాలు.. మండలంలోని శిఖర్‌గానిపల్లి గ్రామంలో మండ్ల వెంకటమ్మకు పది ఎకరాల భూమి ఉంది. ఈమె తన భూమికి సంబంధించిన పట్టాదారు పాసు బుక్కులను నమ్మకంగా ఉంటాని దాయాది అయిన నల్లపోతుల యాదయ్య వద్ద ఉంచింది. యాదయ్య బాలానగర్ మండలం గంగాధర్‌పల్లి గ్రామానికి చెందిన బోయ హన్మంతు కలిసి వెంకటమ్మకు చెందిన పది ఎకరాల భూమి అక్రమంగా అమ్ముకున్నారని వెంకటమ్మ తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు, ఎస్పీలకు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. తనకు తెలవకుండా తన పొలం అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరారు.

డైట్ ప్రవేశ పరీక్షకు 30 వరకు గడువు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 8 : డీఈఈసెట్-2024 అర్హత పరీక్ష కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎ. రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల నుంచి 30 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు అభ్యర్థులు 1 సెప్టెంబరు 2024 నాటికి 17 ఏళ్లు కలిగా ఉండాలని తెలిపారు. డీఈఈసెట్ పరీక్ష తెలుగు ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలలో ఉంటుందని, అర్హత సాధించిన వారికి రెండు సంవత్సరాల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కంప్యూటర్ బేస్‌డ్ పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

పాలమూరు, జూన్ 7 : వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం కావాలని వీఆర్ఏల ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్.గోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలపారు. నేడు (శనివారం) జిల్లా కేంద్రంలో టీఎఫ్‌టీయూ కార్యాలయంలో వీఆర్ఏల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం కొందరు వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పదోన్నతులు ఇచ్చిందన్నారు. పలు శాఖలకు కేటాయించినప్పటికీ అనేక మంది నేటికి చేరలేదన్నారు. అలాంటి వారికి తక్షణమే పోస్టింగ్ ఇవ్వాలన్నారు. 55ఏళ్లు 60ఏళ్ల లోపు వారికి వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. వీఆర్ఏలు సమావేశానికి హాజరై సమస్యలపై చర్చించి పోరాట మార్గం ఏర్పాటు చేసుకుందామన్నారు.

ఆన్‌లైన్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

దేవరకద్ర, జూన్ 7 : వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని రూపకర్త చక్రవర్తి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, యువతకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఆల యువ శిక్షణ యాప్‌ను రూపొందించారని తెలిపారు. ఇప్పటికే ఓ విడత దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ పూర్తి అయ్యిందని వారు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రెండవ బ్యాచ్‌గా ఇప్పుడు కొత్తగా 1000 మంది నిరుద్యోగుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. మండలంలోని ఉన్న నిరుద్యోగులు, ఆసక్తి ఉన్న వారు యాప్ ద్వారా దరఖాస్తు చేసుకొని, వినియోగించుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, అంజనేయులు నరేందర్‌రెడ్డి బాలరాజు, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గండీడ్, జూన్ 7 : భారీ వర్షంతో మండలంలోని ఆయా గ్రామాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ రాక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఇళ్లల్లో కరెంట్ సెల్‌ఫోన్లలో చార్జింగ్ లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పుట్టపాడ్ నుంచి వచ్చే మెయిన్‌లైన్ సమస్య వల్ల కరెంట్‌కు అంతరాయం కల్గిందని ఏఈ తెలిపారు. తమ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారని, త్వరలోనే కరెంట్ వస్తుందని రాత్రి తెలిపారు.

'విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలి'

నారాయణపేట టౌన్, జూన్ 7: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా గ్రామాలకు బస్సులు నడపాలని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్ కోరారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నారాయణపేట డిపో మేనేజర్ లక్ష్మీ సుధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ రవాణా సౌకర్యం కొన్ని గ్రామాలకు లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. విద్యా సంస్థల సమయానుకూలంగా జిల్లా వ్యాప్తంగా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు బన్నీ, మహేష్, లాలేష్, అశోక్, సురేష్ పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం విక్రయాలు

నారాయణపేట, జూన్ 7: నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ధాన్యం విక్రయాల జోరు సాగాయి. వరి సోనా 425క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ ధర రూ.2,720 కనిష్ఠ ధర రూ 2450 , జొన్నలు 98 క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ ధర రూ.4,329, కనిష్ఠ ధర రూ.3,150 పలికింది. వరి హంస రకం రెండు క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠకనిష్ఠ ధర రూ.1820 పలికింది.